# నేను పతివ్రతను కాను



అందంగా అలంకరించబడిన ఆ గదిలో పందిరి మంచం చుట్టూ పందిరి మల్లెమొగ్గల మాలలు దోమ తెర మాదిరిగా దట్టంగా కట్టబడి గదిలోకి ప్రవేశించే మాష్టారి కోసం ఎదురుచూసే పిల్లల్లా గాలికి అటూ యిటూ వూగుతూ వూసులాడుకుంటున్నాయి. ప్రక్కనే టీపాయ్ మీద ఒక పళ్ళెం నిండా పలురకాల తాజా ఫలాలు. మరొక పళ్లెంలో తేనె లొలుకుతున్నట్లున్న రకరకాల స్వీట్లు మిస్ యూనివర్స్, మిస్టర్ యూనివర్స్ పోటీలకు ఒకే స్టేజిమీద 'ప్రదర్శన'కు నిలబడిన యువతీ, యువకుల్లా నిలబడ్డట్టుగా ఉన్నాయి.

'పెళ్ళిసందడి' అగర్‌బత్తిల సువాసన గదంతా వ్యాపించగా, తాంబూల సేవనం కోసం అన్నట్టుగా యాలకులు, లవంగ, దాల్చినచెక్క, కవిరి, తమలపాకులు, సున్నం, వక్కపొడి, కుంకుమపువ్వు మొదలైనవన్నీ ఒక మహా'కార్యా'నికి సంధానకర్తలుగా మరో పళ్ళెంలో నిరీక్షిస్తున్నాయి.

అద్భుతం అనిపించే రీతిలో అమర్చబడిన 'లవ్‌సింబల్'లోని పూలతో పాటు, ఆ పాతకాలపు పందిరిమంచంపై కొత్తపరుపు, తనపై కలగబోయే ఒత్తిళ్ళను ఎలా తట్టుకోవాలా అని ఆతృతతో రెండు దిళ్ళనూ కళ్ళుగా చేసుకొని చూస్తున్నట్టుంది.

తలుపు కిర్రుమని శబ్దం చేసేసరికి అప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న వస్తువులన్నీ లోపలికి రాబోయే అడుగుల సవ్వడి కోసం గుమ్మంవైపే చూస్తున్నంత ప్రశాంతంగా ఉన్న ఆ గదిలోకి అడుగుపెట్టాడు నూతనవరుడు ప్రణీత్! వెనుకనే అతని బట్టలకంటిన ఖరీదైన మైల్డ్ సెంటెడ్ స్మెల్ గదంతా వ్యాపించి అక్కడి వాతావరణానికి ఒక విధమైన 'మత్తు'ను కలుగచేస్తున్నాయి.

అతడు తలుపులు దగ్గరగా వేసి ఫాన్ వేశాడు. మొదటి రాత్రి మనసు పెడుతున్న కలవరం అతని నుదుట, అరచేతులలోనూ, మెడ దగ్గర సన్నటి చిరు చెమటగా మారి ఉండడం వల్ల కాబోలు ఫాన్ గాలి రివ్వున తగలడంతో శరీరం ఒక్కసారిగా చల్లబడినట్లు ప్రకంపించి ఒక్కక్షణం ఉక్కిరిబిక్కిరి అయ్యాడతను.

మేకప్ అవసరం లేని ఎవర్ గ్రీన్ హీరోలా ఉన్న అతను తన సాఫ్టవేర్ ఇంజనీరింగ్ విద్యార్హతను ప్రక్కనపెట్టి మనసులో, మొదటిసారి కంప్యూటర్ ముందు కూర్చున్నవాడిలా ఉద్వేగంగా ఉన్నాడు. మెదడులోని బేసిక్ ఫండమెంటల్స్‌ను మనసులోకి రివైండ్ చేసుకుంటున్నాడు.

'మొదటిరాత్రి' అనే ఫైల్ ఓపెన్ చెయ్యడానికి ఏ సింటెక్స్ ఉపయోగించాలో, అందుకోసం ఏ బటన్ ఎక్కడ ప్రెస్ చేస్తే

ఏవిధమైన ఔట్‌పుట్ వస్తుందో అని కళ్ళముందున్న అదృశ్య స్క్రీన్ మీద రకరకాల దృశ్యాలు వూహించుకుంటున్న అతని ఆలోచనలకు అంతరాయాన్ని కలగచేస్తూ 'శకుంతల' లోపలికి అడుగుపెట్టింది.

అడవి పనస తొనలా, దబ్బపండు వర్ణంతో, అచ్చమైన మునికన్య 'శకుంతల' లా నిండైన ఆమె విగ్రహాన్ని చూస్తూనే అతని నిగ్రహం పటా పంచలైపోయింది. ఆడది అంత అందంగా, సుకుమారంగా, సున్నితంగా నడవగలదు అని అతడు ఆ క్షణమే చూస్తున్నాడు. కాళ్ళక్రింద పూవులు నలిగిపోతాయేమో, అరవిరిసిన మల్లెలు మళ్ళీ ముడుచుకుపోతాయేమో అన్నంత సుతిమెత్తగా నడచి వచ్చి అతని ముందు రెండడుగుల దూరంలో నిలబడిన ఆమె నిజంగా 'శకుంతల' వేషంలో ఉంది.

అందమైన మొదటి రాత్రి యిదేమి వింత వేషం? యిదేమయినా నాటకమా? లేక పెద్దలు కావాలని చేసి పంపిన అలంకారమా? గదిలోకి రాబోయే ముందు "శోభనం" సందర్భంగా దంపతులుగా తామిద్దరమూ పూజచేసినప్పుడు కాటన్ చీరలో పుత్తడి బొమ్మలా తన ప్రక్కన కూర్చొని స్పర్శ చేతనే తనని రోమాంచితం చేసింది ఈమేనా? అతని మనసును ఆలోచనలు హోరెత్తిస్తుండగా ఆమె తలుపు గడియవేసి వచ్చింది. అనాచ్ఛాదితమైన కుడిభుజం జబ్బమీద పావలాకాసంత రెండు టీకామచ్చలు తేనెరంగులో స్పష్టంగా కన్పిస్తున్నాయి.

కోరిక మనసును తేనెటీగలా గుచ్చుతుంటే అతను ఆమెను సమీపించాడు. ఆమె చేతిలోని వెండిపాల గ్లాసును అందుకుని టీపాయ్ పై పెట్టాడు.

ఆమె తన చేతివేళ్ళు అతనికి తాకకుండా జాగ్రత్తపడింది.

ఆమెకట్టుకున్న నారచీర కొంగుపట్టుకుని ఆమెను తనపైకి లాక్కుందామనుకున్న అతని ఆశ అడియాశే అయింది.

ఆమె రెండు చేతులూ జోడించి రెండడుగులు వెనక్కువేసి తలెత్తింది. తెల్లకలువ రేకులవంటి ఆమె నయనాలు, నిండా నీరున్న కొలనుల్లా ఉన్నాయి. అతను హతాశుడయ్యాడు.

"వద్దండీ..నన్ను..నన్ను మీరు తాకవద్దు"

"ఏం ఎందుకని? సిగ్గా?" అతను చిలిపిగా ప్రశ్నించి మరో రెండు అడుగులు ఆమె వైపు వేశాడు.

"కాదండీ! నేను..నేను..."

"ఊ..నువ్వు?..." కొంటెతనంతో అతని కళ్ళు మెరుస్తున్నాయి.

"మీకెలా చెప్పాలో నాకు తెలియడం లేదు. నేను..నేను పతివ్రతను కాను!"

అతను సర్పద్రష్టలా ఆగిపోయాడు.

"శకుంతలా!" అగాథంలో వచ్చినట్టు కీచుగా ఉంది అతని స్వరం.

"మీరు నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి" ఆమె వెనక్కి నడిచి గోడకి అతుక్కుపోయింది.

"యింకేం క్షమించండి? నీ వేషంతోనే నాకు సగం మతిపోయింది. మిగిలిన సగం నీ మాటలతో పోయింది. నాకేమీ నాకు అర్థంకావడం లేదు. ఇదే యింకో

మగాడయితే యీపాటికి లాగి ఒక్కటిచ్చి బయటకుపోయేవాడు" అన్నాడు ప్రణీత్ అయోమయంగా.

ఆమె ప్రాధేయపడుతున్నట్టుగా అంది.

"నిజమేననుకోండి! యిలాంటి మాట విన్నాక పౌరుషం ఉన్న ఏ మగాడైనా అదే పనిచేస్తాడు. కాని చదువు నేర్పిన సంస్కారంతో మీరు మాత్రం అసలు కారణం అడిగి తెలుసుకుంటారని నా నమ్మకం! అందుకే మీరలా మంచం మీద కూర్చోండి. నేను మీకొక కథ చెబుతాను. అది విని కూడా మీరు నన్ను ఏలుకుంటా నంటే నా అంత అదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో ఉండదు. సరేనా?" కళ్ళు తుడుచుకుని ఆమె అన్న మాటలకు అతడు లేని ఓపిక తెచ్చుకొని మంచం మీద కూర్చున్నాడు.

ఆమె అతనికి దగ్గరగా వచ్చి మళ్ళీ నిలబడింది.

"పూర్వం జమదగ్ని మహాముని భార్య రేణుకాదేవి రోజూ వేకువఝామున నదీతీరానికి వెళ్ళి భర్త నామాన్ని అనుక్షణం జపిస్తూ మనస్ఫూర్తిగా మనసులో భర్తకు నమస్కరించుకుని అక్కడి యిసుకతో ఒక బిందెను చేసి దానితో భర్త చేసే నిత్య పూజ కోసం అభిషేక జలం తెచ్చేదట!"

అతను వెర్రి మొహం వేసుకొని వినసాగాడు.

"ఆమె యిసుకతో బిందెనెలా చేయగలిగిందంటారు?" ఆమె ప్రశ్న అతనికి చిరాకుతో పాటు విసుగును కూడా కలిగించింది.

"ఆమె పతివ్రతా శిరోమణి కాబట్టి" కసిగా అన్నాడతను.

"అందుకనే నేను పతివ్రతను కానూ అన్నది" ఆమె బుంగమూతి పెట్టి.

"నువు చెప్పే కథకి, దీనికీ ఏ సంబంధం ఉందో నాకు అర్థం కాలేదు శకుంతలా!" జాలిగా అన్నాడతను.

"పూర్తిగా వినండి మరి! ఒక వేకువ ఝామున నదీ తీరానికి అభిషేక జలం తీసుకురావడానికి వెళ్ళిన రేణుకాదేవికి ఆకాశగమనం చేస్తున్న శివపార్వతులు కనిపించారట. అపురూపమైన ఆ జంటను చూసి 'ఎంత అద్భుతమైన జంట' అనుకుందట రేణుకాదేవి. ఆ ఒక్క క్షణం వివశురాలైనందు వలన ఆమె పాతివ్రత్యం నశించి ఆ తర్వాత ఎంత చేద్దామన్నా ఆమె యిసుకతో బిందెను తయారుచేయలేకపోయిందట.

పూజా సమయం మించిపోయిన తరుణంలో దివ్యదృష్టితో ఆమె అవస్థను గమనించిన జమదగ్ని మహర్షి, తన పుత్రుడు పరశురాముని పిలిచి తల్లిని తోడ్కొని రమ్మన్నాడట. ఆమె వచ్చాక తన పుత్రుని ఆయుధమైన గండ్ర గొడ్డలితో శిరచ్ఛేదం శిక్షగా విధించాడట."

"ఆ తరువాత?"

"తండ్రి ఆజ్ఞను శిరసావహించి తండ్రికి నమస్కరించి పరశురాముడు తన తల్లితలను గండ్ర గొడ్డలితో నరికాడట. తన ఆజ్ఞ శిరసావహించిన పుత్రుని, జమదగ్ని మహర్షి ఏదైనా వరం కోరుకోమన్నాడట. అతడు వెంటనే తన తల్లిని తిరిగి

పునర్జీవితురాలిని చేయమని కోరాడట. ఆయన సంతోషించి భార్యను బ్రతికించాడట. ఒకసారి శిరచ్ఛేదమై, తిరిగి పునర్జన్మ పొందిన ఆమె దోషంపోయి పతివ్రతా శిరోమణి అయిందట! ఈ కథ నుంచి మీరు గ్రహించిందేమిటి?"

"భర్తనే ప్రత్యక్షదైవంగా భావించే ఏ స్త్రీ యైనా పతివ్రతా శిరోమణిగా పూజింపబడుతుంది. పర పురుషుని పొరపాటునైనా కన్నెత్తి చూస్తే ఆమె పాతివ్రత్యం నశిస్తుంది అని. ఇంతకూ ఈ కథలో బలాత్కారాలు, తన ప్రియురాలిని పొందడం కోసం మారువేషంతో వచ్చి మోసం చేసిన మాయా ప్రవరుని వృత్తాంతం లాంటివేమీ లేవే?" అనుమానంగా అడిగాడతను.

"అందుకే నా బాధ అంతా."

"అర్థం కాలేదు శకుంతలా..."

"అవునండీ! నా భర్త హీరో సుమన్ అంత హైట్, సల్మాన్‌ఖాన్ లాంటి బాడీ, అర్జున్‌లాంటి చురుకుదనం, నవీన్ లాంటి సిన్సియారిటీ, మహేష్‌బాబులాంటి అపియరెన్స్ యిలా ఒక్కొక్క విషయానికి ఒక్కొక్కరిని ఎంపిక చేసుకుని వాళ్ళందరూ కలబోసిన వ్యక్తిలా నా భర్త ఉండాలని నేను కన్నె గౌరీవ్రతం చేసి మరీ కోరుకున్నాను. ఒక్కక్షణం భర్త మీద నుంచి ఏకాగ్రతను మరల్చిన రేణుకాదేవే పాతివ్రత్యం కోల్పోతే, నేను పతివ్రతను ఎలా అవుతాను చెప్పండి?" బేర్‌మంది శకుంతల.

"నీ బొంద! మనిషిని కేవలం తలుచుకుంటేనే పతివ్రత కాకుండా పోతారా ఎవరైనా? పెళ్ళికి ముందు బోలెడంతమంది అమ్మాయిలని నేనూ చూశాను. మరి నా శీలం పోయినట్టేనా? అయినా ఈ విషయాలన్నీ ఎక్కడ ఔపోసన పట్టావు?"

ఆమె ముక్కు చీదింది.

"చూడండి. నాకదంతా అనవసరం. నామీద ఒట్టేసి చెప్పండి. మీకెంతమందితో సంబంధం ఉంది?"

"నిజంగా శకుంతలా! నీమీద ఒట్టు. నాకు యిప్పటివరకూ ఆ 'అనుభవం' లేదు" అతను తన చేయి తీసి ఆమె తలమీద పెట్టబోయాడు.

"ఆగండి! ఆ 'అనుభవం' అంటే ఏదని మీ ఉద్దేశం? అంటే... అంటే మీరు... నా దగ్గర అబద్ధం ఆడుతున్నారు. అసలు మీకేం తెలియకపోతే ఆ 'అనుభవం' అన్న పదం ఎందుకు వాడారో చెప్పండి"

"ఖర్మరా దేవుడా! మరింకేమని చెప్పాలి? మొదటిరాత్రి ఏ భార్యభర్తలయినా మనలా మాట్లాడుకుంటారా ఎక్కడయినా?"

"చూశారా! నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఎలా మాట దాటవేస్తున్నారో! నేను అన్యాయం అయిపోయానురా దేవుడో! నేనే పతివ్రతను కాను అనుకుంటే శీలం కోల్పోయిన మొగుడిని కూడా అంటకట్టావా దేవుడో!"

ఇంక నిగ్రహం కోల్పోయిన వాడిలా అరిచి జుట్టు పీక్కున్నాడు అతను! "యీ..." అంటూ.

ఇంక పరిస్థితి విషమిస్తోంది అని గ్రహించిన శకుంతల అతనిని ఒక్కసారిగా వాటేసుకుంది.

ఆమె వెచ్చని స్పర్శతో అతని స్విచెస్ ఆనయ్యాయి. అయినా తెల్లబోతూ అడిగాడు తనలో మొదలైన మత్తును అనుభవిస్తూనే.

"మళ్ళీ యిదేమిటీ?"

ఆమె గోముగా అంది.

"ఏం లేదండీ! మీరెంత నిభాస్వయిన మనిషో తెలుసుకోమని గదిలోకి రాబోతుంటే బామ్మ ఈ కథ చెప్పింది. నాకు యిప్పుడు పరిపూర్ణమైన శీలవంతుడు భర్తగా దొరికాడన్న ఆనందం మిగిలింది. మీకోసం దాచుకున్న ఈ పద్దెనిమిదేళ్ళ పరువాలను మీ చేతుల్లో పెడుతున్నాను. యిక మీ ఇష్టం"

అతని చేతుల్లో ఆమె రబ్బరు బొమ్మలా ఒదిగిపోయింది.

అతడామెను మెల్లగా మంచం దగ్గరగా తీసుకువచ్చి కూర్చోబెట్టి రెండు భుజాలపై చేతులు వేశాడు.

"నా కారెక్టర్ మీద నీకంత అపనమ్మకమైతే పెళ్ళిచూపుల్లో మనం సింగిల్‌గా మాట్లాడుకున్నపుడే అడగవచ్చుగా!" అతడామె ముక్కుకు తన ముక్కును, ఆమె నుదుటికి తన నుదుటిని ఆన్చుతూ అడిగాడు.

"చాల్లెండి! పెళ్ళికి ముందు ఎంత యింటర్వ్యూ అయితే మాత్రం మీకు ఆ 'అనుభవాలే'మయినా ఉన్నాయా అని ఏ పెళ్ళికూతురు, పెళ్ళికొడుకుని అడుగుతుంది చెప్పండి!" కనుబొమలెగరేసి విచిత్రంగా చెప్పిన ఆమె సమాధానానికి బదులుగా ప్రక్కన కూర్చుంటూ అన్నాడు ప్రణీత్.

"యింతసేపు నన్ను వెర్రి వెధవను చేసి ఆడించినందుకు యింక ఏం అడిగినా చెప్పడం ఉండదు. అంతా చేసి చూపించడమే."

"ఛీ పాడు! చూపించడమేమిటి?"

"అదేనోయ్ అనుభవం రుచి చూపించడం. అయినా ప్రతీ మనవరాలికి తల్లి కంటే మంచి గైడ్‌గా 'బామ్మ'లుంటారు. ఎందుకంటావ్?"

"మీరు యిలాంటి చవట ప్రశ్నలు వేసి సమయం వృథా చేస్తారని వాళ్ళకి ముందే తెలుసు కాబోలు! అలా వృథా చెయ్యకుండా తమ అనుభవాలన్నీ కలబోసి 'టెక్నిక్స్' నేర్పేటందుకే ఈ బామ్మలు గైడ్స్‌గా ఉండేది. అర్థం అయిందా.?" అతని నెత్తిమీద చిన్నగా మొట్టింది ఆమె.

అతను మాట్లాడలేదు. ఆమెను వివశురాలిని చేసే ప్రయత్నం మొదలుపెట్టాడు. అతని మైక్రోప్రాసెసర్ అతను యిస్తున్న యిన్‌పుట్ సంకేతాలు అందుకుంటూనే మస్తిష్కపు స్క్రీన్‌మీద అవుట్‌పుట్‌ని అందించసాగింది. తన మనసు ప్రింటర్‌పై వరుసగా వస్తున్న చిత్రాలను ముద్రించుకునే ప్రయత్నంలో మునిగిపోయాడు - ప్రణీత్. ●

'ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక'
06-04-2000